రొట్టెల పండగ సందడి

నెల్లూరులో రొట్టెల పండగ సందడి నెలకొంది. ఈనెల 6వ తేదీన అధికారికంగా పండగ మొదలవుతుంది. అయితే దూర ప్రాంతాల నుంచి భక్తుల రాక మొదలైంది. శుక్రవారం స్వర్ణాల చెరువులో పెద్ద ఎత్తున కోర్కెల రొట్టెలను భక్తులు అందుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


రొట్టె తీసుకున్న తర్వాత..


విద్యుద్దీపాల కాంతుల్లో దర్గా


స్వర్ణాల చెరువులో భక్తుల రద్దీ

క్లుప్తంగా

సమర్థవంతంగా సర్వే

నెల్లూరురూరల్: జిల్లాలో పీ–4 సర్వేను సమర్థవంతంగా చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. పీ–4 కార్యక్రమంపై సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లు, శాసనసభ్యులతో శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హాలు నుంచి జేసీ, జిల్లా అధికారులు పాల్గొని, పీ–4 కార్యాచరణ గురించి వివరించారు. జిల్లాలో పక్కాగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

హామీల అమలు ఎప్పుడూ?


నిరుద్యోగుల సంతకాలు సేకరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా ప్రశ్నించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నిరుద్యోగుల సంతకాల సేకరణను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హామీల అమలులో భాగంగా ఈనెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. యువత భారీగా పాల్గొనాలని కోరారు.

న్యూరోకాన్ సదస్సు ప్రారంభం

నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయి 32వ న్యూరోకాన్ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఏపీ న్యూరో సైన్సెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, న్యూరాలజీ విభాగాధిపతి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ వరకు సదస్సు జరుగుతుందన్నారు. వైద్యరంగంలో అవలంబిస్తున్న అత్యాధునిక చికిత్స పద్ధతుల గురించి చర్చిస్తున్నామన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పీఎస్ రెడ్డి, డాక్టర్ సాయికిరణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని జనార్దనరెడ్డికాలనీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో అలంకార్ సెంటర్, రామయ్యబడి వీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

20న ఆలిండియా చెస్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూలై 20న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎంజీ బ్రదర్స్ ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఈట గోపాలకృష్ణ అన్నారు. ఆనంద్ చెస్ వింగ్స్, ఏపీ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన మాల్లో శుక్రవారం ఆవిష్కరించారు. మరిన్ని వివరాలకు 97030 49378 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుమన్, మాల్ డీజీఎం మల్లికార్జున, అసిస్టెంట్ మాల్ మేనేజర్ కృష్ణ, అకాడమీ డైరెక్టర్ గోపీనాథ్, కోచ్ ఈట మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

14 పాఠశాలల అభివృద్ధికి చర్యలు

నెల్లూరు (టౌన్): వీఆర్ హైస్కూల్ తరహాలో దాతల సహకారంతో నగరంలో మరో 14 పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం వీఆర్ హైస్కూల్‌తో పాటు సంతపేటలోని ఆదర్శ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 7న విద్యాశాఖ మంత్రి లోకేష్ వీఆర్ హైస్కూల్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం సిటీ కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు.

మేనేజర్ చేతివాటం

నెల్లూరు(క్రైమ్): మేనేజర్ చేతివాటంపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మినీబైపాస్ రోడ్డులో మాన్యువల్ దుస్తుల షాపు ఉంది. అక్కడ వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన హజరత్‌రెడ్డి మేనేజర్‌గా, నెల్లూరు వెంగళరావ్‌నగర్‌కు చెందిన షంషుద్దీన్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 9న షంషుద్దీన్ షోరూమ్‌ను తెరిచారు. క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ.1.80 లక్షల నగదు కనిపించలేదు. మేనేజర్‌కు ఫోన్‌చేయగా స్విచాఫ్ వచ్చింది. అతని కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఈమేరకు షంషుద్దీన్ శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

నెల్లూరు (బారకాసు): రేపటి నుంచి రొట్టెల పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక బారాషహీద్ దర్గా వద్ద ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీ టీవీలు అవసరమైనన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. పబ్లిక్ అనౌన్స్ సిస్టమ్ ఉండాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ నందన్‌లతో కలిసి దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్‌లను పరిశీలించారు.


దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎస్పీ

• రొట్టెల పండగ నిర్వహణ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. బారాషహీద్ దర్గాలో అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో షామియానాలు, కమాండ్ కంట్రోల్ విభాగం, వీఐపీ రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

ఆధార్‌తో వాహనాలను తీసుకెళ్లొచ్చు

నెల్లూరు సిటీ: బారాషహీద్ దర్గా పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును చూపించి వారి ప్రాంతాలకు వెళ్లవచ్చని రూరల్ తహసీల్దార్ కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద స్థానికులు తమ ఆధార్ కార్డును చూపించి వెళ్లవచ్చని తెలియజేశారు.

వైద్యవిద్యకు కూటమి తూట్లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం వైద్యవిద్యకు తూట్లు పొడుస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు వైద్యవిద్యలోకి పీపీపీ విధానాన్ని తీసుకురావడం బాధాకరమన్నారు. దీని ద్వారా వైద్య కళాశాలలు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లి పేద విద్యార్థుల ఎంబీబీఎస్ కలలు నాశనం అవుతాయన్నారు. అంతేకాకుండా కళాశాలకు అనుబంధంగా జనరల్ హాస్పిటల్స్‌లో పేదలకు ఉచిత వైద్యం అందే పరిస్థితి ఉండదన్నారు. గతంలో ప్రభుత్వంలో జగనన్న 17 వైద్య కళాశాలలు నెలకొల్పేలా ఆదేశాలు ఇచ్చారని, సుమారు 80 శాతం పూర్తయిన కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ శక్తులకు


మాట్లాడుతున్న అశ్రిత్‌రెడ్డి

దారదత్తం చేయడం బాధాకరమన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం అన్ని నియోజకవర్గ కమిటీలతో కలిసి విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీని కలిసి వైద్య విద్యార్థుల గోడును తెలియజేస్తామన్నారు. విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సతీష్‌బాబు, రూరల్ అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, కావలి, కందుకూరు, సర్వేపల్లి, ఆత్మకూరు అధ్యక్షులు పామాంజి శ్యామ్, అశోక్, హేమంత్, విష్ణు, వెంకీ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణా కార్యక్రమాలు

నెల్లూరు (పొగతోట): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్, సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిరుద్యోగులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సుమారు 150 మంది నిరుద్యోగులు వివిధ రకాల యూనిట్ల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. వారికి సెంచూరియన్ యూనివర్సిటీ అధికారులు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి సబ్సిడీ రుణాలు మంజూరు చేయిస్తారన్నారు. కార్యక్రమంలో జేడీఎం హైమావతి, వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు బిశ్వజిత్తు సాధు, అరబింద ఉపాధ్యాయ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై దర్యాప్తు చేయాలి

నెల్లూరు (టౌన్): ధనలక్ష్మీపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో రోహిత్ అనే విద్యార్థి మృతిపై సంపూర్ణ దర్యాప్తు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర డిమాండ్ చేశారు. స్థానిక బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోహిత్ ఆత్మహత్యపై తల్లిదండ్రులు ఆరోపించిన విధంగా నిజాలను వెలికితీయాలన్నారు. ఈ ఘటనపై ఆర్ఐఓ కూడా వెంటనే స్పందించి సంబంధిత కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విక్రమ్, దేవేంద్ర, నాని, యగ్నేష్, లోకేష్, బాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి మహావిద్యాలయలో ఎన్‌సీసీ ప్రారంభం



మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారి గణేష్

నెల్లూరు (టౌన్): స్థానిక దర్గామిట్టలోని ప్రగతి మహావిద్యాలయ సీబీఎస్ఈ పాఠశాలలో ఎన్‌సీసీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి గణేష్ హాజరై, మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాతత్పరత అలవడుతుందన్నారు. ఉద్యోగాల భర్తీలో కూడా ఎన్‌సీసీ కోటా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సూపరింటెండెంట్ సాగర్‌ముకుంద, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రంజన్, స్కూల్ కరెస్పాండెంట్ బెజవాడ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 13వ డివిజన్ లక్ష్మీనగర్‌లో జరిగిన నిమ్మల వెంకటరమణయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం హాజరయ్యారు. నిమ్మల చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పారదర్శకంగా ఆస్పత్రుల నిర్వహణ

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పీహెచ్‌సీల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఎంహెచ్ఓ సుజాతతో సమావేశమయ్యారు. పీహెచ్‌సీల్లో ఓపీ వివరాలు, ఇన్‌పేషెంట్ వివరాలు, మిడ్‌నైట్ హెడ్ కౌంట్ వివరాలు నమోదుపై చర్చించారు. అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

రూ.11 లక్షల అందజేత

నెల్లూరు(అర్బన్): ఏసీ స్టేడియంలో ఈనెల 11 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రెవెన్యూ క్రీడా ఉత్సవాల నిర్వహణ కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం రూ.11 లక్షల ఆర్థిక సాయాన్ని తన నివాసంలో అందజేశారు. డీఆర్వో ఉదయభాస్కర్‌రావుతో పాటు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, పలువురు నాయకులు పాల్గొని, వేమిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

జ్యోతినగర్‌లో వైద్యశిబిరం

నెల్లూరు(అర్బన్): వేదాయపాళెం–జ్యోతినగర్‌లోని శ్రీరామ ప్రాథమిక పాఠశాలలో జ్యోతి బొటిక్స్ చారిటీస్ సంస్థ నిర్వాహకురాలు రాధిక ఆధ్వర్యంలో డాక్టర్ కూరపాటి రాజమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తొలుత రాజమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకురాలు వసుంధర పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): సింగపూర్‌లో ఉద్యోగాలిప్పిస్తానని పలువురిని మోసగించిన వ్యక్తిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. డ్రైవర్స్‌కాలనీలో షఫీ అహ్మద్ నివాసం ఉంటున్నారు. ఆయనకు మూడేళ్ల కిందట సికింద్రాబాద్‌కు చెందిన అహ్మద్ మొహిద్దీన్‌తో పరిచయమైంది. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తుంటానని నమ్మించారు. అలా ఆరునెలల కిందట సింగపూర్‌లోని షిప్‌యార్డ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని షఫీ అహ్మద్, ఆయన కుమారుడు అమ్‌జాద్, అల్లుడు మీరామొహిద్దీన్‌లను నమ్మించి పలు దఫాలుగా రూ.7.50 లక్షల నగదును ఫోన్‌పే చేయించుకున్నాడు. వారి ఒరిజినల్ పాస్‌పోర్టులు, సర్టిఫికెట్లను తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఉద్యోగ విషయం తేల్చకపోవడంతో బాధితులు అహ్మద్‌మొహిద్దీన్‌ను ఫోన్‌లో నిలదీశారు. ఇటీవల ఆయన ఫోన్‌నంబర్‌ను కూడా మార్చేశారు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు నిందితుడిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అవార్డుల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పురమందిరంలో ఈనెల 6న సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'బెస్ట్ డాక్టర్ అవార్డు–2025' ప్రదానోత్సవం జరుగనుందని సంస్థ అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. నగరంలోని 16 మంది ప్రముఖ వైద్యులకు అవార్డులను అందజేయనున్నామన్నారు.

నేత్రదానం

నెల్లూరు(అర్బన్): కావలి పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మన్నెమాల అన్నపూర్ణమ్మ (85) గురువారం రాత్రి ఆమె నివాసంలో మృతిచెందారు. ఈ క్రమంలో అభయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు శ్రీవాణి సహకారంతో కుటుంబ సభ్యుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి ఆమె నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ ఆమె నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు అభయం సేవా సంస్థ సభ్యురాలు శ్రీవాణి (94946 08060), సునీల్ (99595 89321) నంబర్లను సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనాల ప్రారంభం

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పోలీస్‌శాఖకు కేటాయించిన 20 ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్ కవాతు మైదానంలో ఎస్పీ కృష్ణకాంత్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వాటిని ట్రాఫిక్, నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్‌డివిజన్లకు కేటాయించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పగటి, రాత్రి గస్తీ నిర్వహణ, అత్యవసర వేళల్లో ఘటనా స్థలాలకు త్వరితగతిన చేరేందుకు ద్విచక్ర వాహనాలు దోహదపడుతాయని ఎస్పీ చెప్పారు. ఏఎస్పీ సౌజన్య, నగర, రూరల్, ఏఆర్ డీఎస్పీలు పి.సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత పెంచాలి

నెల్లూరు(బారకాసు): ఆర్పీలు మహిళాశాకం యాప్ ద్వారానే డేటాను అప్‌లోడ్ చేసి పారదర్శకతను పెంచాలని మెప్మా పీడీ లీలారాణి పేర్కొన్నారు. నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న స్వశక్తి భవనంలో ఆర్పీల సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మెప్మాలో సంఘాల డేటా పారదర్శకత పెరిగిందని, ఇది మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మెప్మా టీబీ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ నేపథ్యంలో పాత నేరస్తులు, జేబుదొంగలకు కౌన్సెలింగ్‌ను సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ భారీ జనాల మధ్య నేరాలకు పాల్పడాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దర్గా ఆవరణలో కనిపించినా చర్యలు ఉంటాయన్నారు.

డీకేడబ్ల్యూలో వర్క్‌షాప్

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సహకారంతో భూసార పరీక్షలపై శుక్రవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ దీని ద్వారా రైతులు వారి పొలం మట్టిని పరీక్షించుకోవచ్చన్నారు. తద్వార భూమిలో పోషక విలువల స్థాయిని తెలుసుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఓడీ మోహన్‌రెడ్డి, ఏరీస్ కంపెనీ డిప్యూటీ డైరెక్టర్ జయప్రదీప్, సుబ్రహ్మణ్యం, రత్తయ్య, బాల గ్రూపు చైర్మన్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు సిటీ: రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు ఆర్డీఓ అనూషను ఆమె కార్యాలయంలో శుక్రవారం కలిశారు. రూరల్ పరిధిలోని పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

అమ్మణ్ణి సన్నిధిలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆషాడమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రాహుకాల ఉద్యాపన పూజల్లో 42 మంది భక్తులు పాల్గొన్నారు. రాహుకాల దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాద వితరణ జరిగింది. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

శంకరమఠంలో హోమాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకర మఠంలో కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో కామ్య హోమ సప్తాహ మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. తొలిరోజు గణపతి, సుబ్రహ్మణ్య హోమాలు, సాయంత్రం గణపతి సహస్రనామ పూజ జరిపామని నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి తెలిపారు. వారం రోజుల పాటు విశేషంగా నిర్వహించే హోమాలు, పూజల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



ఘనంగా రోశయ్య జయంతి

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేట ఎన్ఎస్సార్ కాంప్లెక్స్ రైస్ కాన్వాసింగ్ అసోసియేషన్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఆర్యవైశ్య ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు ఆధ్వర్యంలో తొలుత రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోశయ్య ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకానికి, ఆర్యవైశ్య సంఘీయులకు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో రోశయ్య కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేసి తగిన గౌరవం ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో కోట గురుబ్రహ్మం, ఎంపి.ఆంజనేయులు, భవనాసి సురేష్‌బాబు, పచ్చిపులుసు శ్రీరాములు, జొన్నలగడ్డ మోహన్‌రావు, దాసా లక్ష్మీనారాయణ, మంచికంటి శ్రీనివాసులు, గాదంశెట్టి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణకు కృషి

నెల్లూరు (టౌన్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లీడ్‌బ్యాంకు మేనేజర్ మణిశేఖర్ తెలిపారు. కెనరా బ్యాంకు 120 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంకు, లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. హెచ్ఎం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం చప్పరోత్సవం, రాత్రి ద్రౌపతీదేవి మానసంరక్షణ ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా మణికన్నన్ వెంకటేష్, లక్ష్మి, పంచాగ్నుల మనోజ్‌కుమార్, లక్ష్మీవెంకటసాయి, సింధూరి వ్యవహరించారు. ఈఓ జానకి పాల్గొన్నారు.

తపస్సు మానోత్సవానికి సర్వం సిద్ధం

శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో శనివారం జరుగనున్న 'తపస్సుమాను' ఉత్సవానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. నగరంలోని సంతపేట నుంచి ప్రత్యేకంగా 28 అడుగుల తపస్సుమాను (అశోకవృక్షం)ను దేవస్థానం వద్దకు భారీ క్రేన్ సహాయంతో శుక్రవారం సాయంత్రం తరలించి, ప్రతిష్ఠించారు. భక్తులు తపస్సుమానును అధిరోహించేందుకు ప్రత్యేకంగా మెట్లను ఏర్పాటుచేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం


అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్


జెడ్పీలో..

నెల్లూరు(క్రైమ్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. అల్లూరి సీతారామరాజు 128వ జయంతి కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి ఎస్పీ, పలువురు పోలీసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణకాంత్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం అసమాన పోరాటం చేసిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఆర్ఐలు అంకమరావు, రాజారావు, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ కార్యాలయంలో అల్లూరు సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు.

పారా అథ్లెటిక్స్‌లో భవానికి పతకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో నెల్లూరు జిల్లాకు చెందిన భవాని రెండు బంగారు పతకాలు సాధించారు. ఈనెల 1 నుంచి చెక్ రిపబ్లిక్‌లోని ఒలొమాక్‌లో ప్రపంచస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భారతదేశం తరఫున జిల్లాకు చెందిన భవాని పాల్గొని, 200 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. దీంతో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటేశ్వరరావులు ఆమెకు అభినందనలు తెలిపారు.


బంగారు పతకాలతో భవాని